# అమృత ఘడియల అనుభూతి

'లత'

కాలాన్ని తనతో ఈడ్చుకుంటూ వేగంగా పరిగెత్తు తోంది మెయిలు. కిటికీలోంచి బయటి చీకటి పొగుల్లోకి చూస్తూంటే ఆ చీకటి నేసన్ని విశ్వ సుందరీ విరాణ్మూర్తి తలంబ్రాలు పోసుకుంటున్న మనోహరదృశ్యం మనసులో రూపు కడుతోంది కాని నిలవటంలేదు; ఆ దృశ్యాన్ని మనోనేత్రంతో చూడాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాను.

రైలు ఏదో స్టేషన్లో ఆగింది. కాలమూ ఆగి పోయింది. కాలగమనమే ఆగిన ఆ మహామధుర క్షణంలో చీకటిని చీల్చుకుంటూ ఒక మూర్తి లోపల ప్రవేశించింది. కాలమూ రైలూకూడా మళ్ళీ మహావేగంతో పురోగమిస్తూన్నాయి.

ఏడుసంవత్సరాల తరువాత ఆ మూర్తినిగురించి కథ వ్రాయాలని కలం పుచ్చుకున్నాను. ఏం వ్రాయను? ఆకాశంలో నీలాన్ని ఎలా చిత్రించగలను? వెన్నెల తాగిన చకోర మిథునాల మధుర కూజితాల్ని ఎలా రికార్డు చేయగలను? ఏ సన్నజాజి మొగ్గ ఎప్పుడు సిగ్గుపడుతుందో ఎలా వర్ణించగలను?

స్కెచ్

కథ...ఆ మూర్తిని గురించిన కథ; చెప్పాలను కున్న దేదో చెప్పలేక పోతున్నాను. మనోభావాల్ని మనోజ్ఞంగా చెప్పలేక పోతున్నాను. ఎలా చెప్పటం? నా నెత్తురులో కలం ముంచి కథ వ్రాయాలి అనుకొంటే నా రక్తం అరుణారుణంగా జపాకుసుమ సంకాశంగా ఉంది. ఆ రంగు వ్రాయ టానికి బాగుండదు మరి. నా హృదయంలో నీలలోహితాలు ప్రవహించటంలేదే! ఎలా వ్రాయను? ఒక్కసారికూడా మాట్లాడని ఆమహాబలిపురంలోని శిలనిగురించి కథ వ్రాయనా? జ్ఞాపకాల బాకు పోట్లతో గుండెను తూట్లుచేసి రక్తక్షయం చేసే ఆ మూర్తిని గురించి కథ వ్రాయనా? వ్రాస్తున్నాను. ఊహాల్లో కనిపించే ఉచ్చైశ్శ్రవపు ఉద్ధృతాన్ని గురించి వ్రాస్తున్నాను; సవ్యసాచి పెదవుల్లో గంభీర సంగీతంపాడే దేవదత్తాన్ని గురించివ్రాస్తున్నాను. ఆ దివ్యశక్తిఅందాలు వర్ణించటం ఆ మూర్తిని ఆకళింపు నకు తెచ్చుకోవటం నాకిప్పటికీ సాధ్యంకాలేదు. ఏడుసంవత్సరాలు...ఏడుసంవత్సరాలతర్వాతకూడా ఆ ప్రయాణం ఇంకా పూర్తికాలేదు. ఇన్నాళ్ళూ ఆ మూర్తితో కాలరథంలో ప్రయాణిస్తూనే ఉన్నాను. అయినా ఆ మూర్తి అంతుపట్టలేదు.

కొన్నికొన్ని జ్ఞాపకాలు అంతే. వాటిని గురించి వ్రాయాలనుకొన్నప్పుడు కలం నడవదు. గుండె ఆగిపోతుంది. కాలం స్తంభించి పోతుంది. ఐనా వ్రాయాలనిపిస్తుంది. ఆదేవిచిత్రం. నా ఎదురు బెర్తు మీద నిర్లక్ష్యంగా పడుకున్న ఆ విచిత్రవ్యక్తి ఎవరు? నాకు మాత్రం ఏంతెలుసు? హిమగిరి శిఖ రాల్లో సూర్యోదయపు వెల్తురు పంచుకున్న దేవ మూర్తి కావచ్చును. మహాకవి భావాల్లోని మధుర మూర్తి కావచ్చును. లేదా మామూలు మనిషి కావచ్చును. ఏదీ చెప్పలేము.

ఆ మూర్తిచేత మాట్లాడించాలని వ్యర్థ ప్రయత్నం చేశాను. ఆ హృదయపు లోతుల్లో మణులే ఉన్నాయో ఫణులేఉన్నాయో వెతుకుదామని నిరర్థక కృషి చేశాను. భూలో కంలో అజ్ఞానులు తనని భేదించటానికి చేసే ప్రయత్నం తెలిసీ కూడా చలించని అలౌకికా కారంగల ఆ వ్యక్తిని నేనేం చేయగలను?

ఆ వ్యక్తి పేరు తెలియదు; ఊరు తెలియదు; ఒకటిమాత్రం తెలుసు. అతన్ని ఎన్నోయుగాలనించి ఎరిగున్నాను. చేసిన తప్పులకి క్షమించని మహా ఋషి శాపంవల్ల కలియుగంలో కొంతసేపే కలిసి ఉన్నామనికూడా తెలుసును. ఒకటి మాత్రం తెలి యదు- ఈ మహాశాపానికి విముక్తి యెప్పుడో: బహుశా లేకపోవచ్చును. శిల అయిన అహల్య లాగా ఏనాటికైనా స్వస్వరూపప్రాప్తి కలుగు తుందనే నా ఆశమాత్రం చావలేదు. అందాకా వెతుకుతూ ఉంటాను. ఏ గుండెచప్పుడులోనైనా ఆ గుండెల చప్పుడు వినపడుతుందేమోననే ఆశతో

ప్రతి గుండెలలోకి తొంగిచూస్తూ ఉంటాను; ఏ వ్యక్తిలోనయినా ఆమూర్తి దర్శనమిస్తుందేమోనని ప్రతిమూర్తినీ పరిశీలిస్తూనే ఉంటాను. లోకం నన్ను అపార్థం చేసుకుంటే ఏం చేయను? అభాండాలు వేస్తే నాకేంలెక్క? ఏం చేయటానికయినా నా చేతుల్లో ఏముంది కనుక?

ఇంతకూ ఆరోజు జరిగిన కథ చెప్పనేలేదు. చెప్పాలంటే మాటలకోసం మొదట వెతుక్కోవాలి; వెతుక్కోగానే కాశ్మీరంలో కుసుంబా తోటలూ సహారా ఎడారిలో ఇసుక తుఫానూ షాంపేన్ పరిమళమూ జ్ఞాపకంవస్తుంది ఆమత్తులో నేనేంచెప్పగలను?

ఐనా కొంచెంసేపు కలపుల స్వర్గానికి తలుపులు తెరుస్తాను మధురానుభవాల్లో మెలకువలు వివరిస్తాను గుండెల్లో నిదురించే కోడెత్రాచుకి నాగస్వరం పడతాను.

ఐదు గంటలపాటు కలిసిచేసిన ఆ ప్రయాణంలో అరనిముసమైనా మాట్లాడని ఆమూర్తి మన స్తత్వం యెంత విచిత్రం! పోనీ ఆలాగే దిగి వెళ్ళిపోతూ డదూ? వెడుతూ వెడుతూ నాగుండెల సితారు మీద ఏనాటికీ ఉపశమించని ఆ దీపక్ రాగానికి శ్రుతి చేయటమెందుకు? గాయకుడు వదిలిపెట్టిపోయిన ఆ దురదృష్టపు సితారు అపశ్రుతులు పలుకుతోందని ఆక్షేపిస్తే అది దాని తప్పా? లోకంలో ఏది మంజులరాగమో ఏది వికిరగానమో తెలుసుకునే శక్తి ఆ సితారుకి నశించిపోతే అది సితారుతప్పా?

ప్రపంచంలో ఈక్షణం ఇకముందు రాదని తెలుసుకున్నప్పుడు ఆ విషయం నాకు ఎందుకు చెప్పకూడదు? అలా చెస్తే కాలానికి సంకెళ్ళు వేసి ఉండేదాన్ని; ఆమూర్తిని నాకనుపాపల్లో నిలిపి ఉంచుకునేదాన్ని.

ఆ అర్థరాత్రి సమయంలో ఆ సెకండ్ క్లాస్ కంపార్టుమెంటులో జరిగిన ఈ కథ ఏడుసంవత్సరాల క్రితం జరిగిన కథ. చీకటిని ప్రేమిస్తూ వెలుతురును ద్వేషించే ఈ రోజుల్లో వ్రాయటానికి కూర్చున్నాను; చెప్పెయ్యాలి: ఎన్నాళ్ళు దాచుకున్నా ఏ ప్రయోజనమూ లేదు.

మూడో ప్రాణి ఆ పెట్టెలో ఉంటే ఎంత బాగుండేది. అర్థరాత్రులూ అంధకారాలూ ఒకప్పుడు జీవిత గమ్యాన్నే అగమ్యంగా చేసి వదిలిపెడతాయి. ఆ రోజు ఆ మామూలు రైలుపెట్టెలో ఒక మూగ గాయకుడు ఒక మహా వీణమీద మేఘ మల్హార్ రాగానికి శ్రుతిచేసి రాగం పూర్తికాకుండానే వెళ్ళిపోయినాడు. ఒక మహాకవి మహాకావ్యాన్ని ఎలా పూర్తిచేయాలో తెలియక ఆ అసంపూర్ణ కావ్యాన్ని అలాగే వదిలిపెట్టిపోయినాడు. ఒక విచిత్ర చిత్రకారుడు జీవిత చిత్రాన్ని పరుద్దామని ప్రయత్నించి చోటు చాలక విసుగుతో లేచిపోయినాడు.

అతనెవరో తెలియదు; అసలు అతనో మామూలు మానవుడో దివ్యుడో మధుర హృదయుడో మహా భయంకరుడో నేను ఈ నాటికీ తెలుసుకోలేదు. ఏడు సంవత్సరాల నుంచీ ఆ విషయం ఆలోచిస్తూన్నా ఇంకా అంతుబట్టలేదు.

ఆ అయిదు గంటలూ అరక్షణం కూడా వృథా కాకుండా ఆశ్చర్యం కళ్ళలోకి రాకుండా అలాగే కాలనాగినిని దారాలతో బంధించినట్లు చూపు దారాలతో నా చుట్టూ సాలెగూడు అల్లటమెందుకో. అదే తమాషా; ఆ సాలెగూట్లోనించి నేను ఈనాటికీ తప్పించుకోలేకుండా ఉన్నాను. తప్పించుకుందామని నేను చేసే వ్యర్థప్రయత్నంలో నా నరాలే తెగిపోతున్నాయిగాని ఆ దారాలు అలాగే ఉన్నాయి; ఇంకా బిగుసుకుపోయాయి.

ఆ రోజునించీ నేనిలా మారిపోయినాను; ఆ రోజు నించీ నా గుండెల చప్పుడు లోకానికి అపశ్రుతులుగా వినపడుతున్నది. మరి గాయకుడు వదిలిపెట్టి పోయిన దురదృష్టపు సితారుమీద సుస్వరాలు ఏనాడూ ధ్వనించవు. మహా చయితకి విసుగెత్తించిన రచన ఎప్పటికీ అసంపూర్ణంగానే ఉండిపోతుంది.

అప్పటినించీ ఆ గుండెల చప్పుడు వినబడుతుందేమోననే ఆశతో ప్రతి గుండెలలోకీ తొంగి చూస్తూ ఉంటాను. ఏ వ్యక్తిలో నయినా ఆ మూర్తి దర్శనమిస్తుందేమోనని ప్రతి మూర్తినీ పరిశీలిస్తూ ఉంటాను. లోకం నన్ను అపార్థంచేసుకుంటే ఏంచేయను? అభాండాలు వేస్తే నాకేం లెక్క? ఆస లేంచేయటానికయినా నా చేతిలో ఏముంది కనుక...

★